## క్లుప్తంగా

### దర్గాలో ఎమ్మెల్యే ప్రత్యేక ప్రార్థన



నారాయణపేట రూరల్: మండలంలోని కొల్లంపల్లి కతల్ ముస్సేన్ దర్గాను సోమవారం మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సందర్శించారు. ఈ సందర్భంగా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎంతో ప్రఖ్యాతి గాంచిన దర్గాకు రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అనంతరం గ్రామ మాజీ సర్పంచ్ సాయిరెడ్డి ఇచ్చిన విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎండీ గౌస్, చంద్రకాంత్‌గౌడ్, బండి వేణుగోపాల్ పాల్గొన్నారు.

### పాఠశాలలో మరమ్మతు పనుల పరిశీలన



ఊట్కూరు: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న మరమ్మతు పనులను ఎంపీడీఓ ధనుంజయగౌడ్ పరిశీలించారు. అనంతరం బిజ్వార్‌లో పారిశుద్ధ్య పనులను, ప్రకృతివనాన్ని పరిశీలించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు సూచించారు. ముగ్దుంపూర్‌లో నర్సరీని పరిశీలించి మొక్కల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వీఆర్ఏఈ జగత్‌చంద్ర, కార్యదర్శి శ్రీనివాస్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

### అయోధ్యకు బయలుదేరిన భక్తులు




మద్దూరు: మద్దూరుకు చెందిన 44 మంది భక్తులు అయోధ్య, కాశీ యాత్రకు బయలుదేరి వెళ్లారు. మూడు రోజుల కిందట మద్దూరు పాతబస్టాండ్ ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన దోరేపల్లికి చెందిన బాలయ్య ఆధ్వర్యంలో బస్సు బయలుదేరింది. సోమవారం రాంటెక్‌లో దర్శనం పూర్తి చేసుకొని కాశీకి వెళ్తున్నట్లు యాత్ర నిర్వాహకుడు తెలియజేశారు. కాశీ అనంతరం అయోధ్య దర్శించుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. యాత్రకు వెళ్లిన వారిలో ఉసేనప్ప, చంద్రప్ప, రాములు, పద్మమ్మ, నర్సింహులు తదితరులు ఉన్నారు.

### బాధిత కుటుంబానికి పరామర్శ

మక్తల్: మక్తల్‌కు చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, బీఎస్పీ జిల్లా కార్యదర్శిగా పనిచేస్తున్న అర్జున్‌రాజు(50) ఆదివారం మక్తల్‌లో గుండెపోటుతో మృతిచెందాడు. దీంతో సోమవారం మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పుష్పగుచ్ఛం వేసి నివాళి అర్పించారు. అనంతరం ఇంటి నుంచి యల్లమ్మకుంట మీదుగా శవయాత్ర నిర్వహించి ఊరేగింపుతో వెళ్లి కన్నీటి వీడ్కోలు మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. అర్జున్‌రాజు గుండెపోటుతో మృతిచెందడంతో మండలం ప్రజలు విచారం వ్యక్తం చేశారు. అర్జున్‌రాజు మృతిచెందిన విషయం తెలుసుకున్న వివిధ పార్టీలకు చెందిన నాయకులు, అంబేద్కర్ సంఘం, ధర్మసమాజ్ పార్టీ నాయకులు, వివిధ కుల సంఘాలు అక్కడికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

### మక్తల్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా చారి ఎన్నిక




మక్తల్: మక్తల్ లయన్స్ క్లబ్ బీమా నూతన అధ్యక్షుడిగా మక్తల్‌కు చెందిన డీవీ.చారిని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా శ్రీనివాస్‌గుప్తా వ్యవహరించగా.. సీనియర్ సభ్యులు చంద్రకాంత్‌గౌడ్, కొండయ్య సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా నియామకమవడంపై పలువురు లయన్స్ సభ్యులు అభినందించారు. నూతనంగా ఎన్నుకున్న సందర్భంగా జూలైలో ప్రమాణం చేయనున్నారు. కార్యక్రమంలో ప్రస్తుత అధ్యక్షుడు అంబదాస్, కార్యదర్శి మఠంవాదిరాజ్, కోశాధికారి అంజన్‌ప్రసాద్, రవికుమార్, అనుగొండ శ్రీనివాసులు, కోళ్ల వెంకటేష్, సత్యఆంజనేయులు, జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి బ్రహ్మోత్సవాలు



స్వామివారి మూలవిరాట్



స్వామి వారి కోనేరు

- మాగనూర్‌లో వెలసిన లక్ష్మీనారసింహస్వామి
- 21 నుంచి 25వ తేదీ వరకు కొనసాగింపు
- వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు
- కర్ణాటక, మహారాష్ట్ర నుంచి లక్షలాది మంది భక్తుల రాక



స్వామి వారి ప్రధాన ఆలయం గర్భగుడి

మాగనూర్: మాగనూర్‌లో తూర్పు వాగు కలిగి పచ్చని పంట పొలాల నడుమన.. ఆహ్లాదకరమైన వాతావరణంలో వైకుంఠ వాసుడు శ్రీ లక్ష్మీనారసింహస్వామి, లక్ష్మీదేవి, చెంచులక్ష్మి అమ్మవారి సమ్మేతంగా ఇక్కడ ప్రతిష్టింపబడ్డాడు. జిల్లాలో ప్రసిద్ధి చెందినట్లు ఆలయ చరిత్ర చెబుతోంది.

**కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం..**

మాగనూర్‌లో వెలిసిన వైకుంఠ వాసుడు శ్రీలక్ష్మీనారసింహస్వామిని దర్శించుకున్న భక్తులకు కోరిన కోర్కెలు తీర్చి, అడిగిందల్లా ప్రసాదించే ఆపద్బాంధవుడిగా ప్రత్యక్షమవుతున్నారని అపార నమ్మకం ఇక్కడి ప్రజల్లో నాటుకుంది. ముఖ్యంగా ఆపదలో ఉన్న వారు స్వామిని దర్శించుకున్నా.. విముక్తి కలుగుతుందని ప్రత్యేక్షంగా అనుభవం పొందిన భక్తుల విశ్వాసం. స్వామి వారి కటాక్షంతో వ్యాపారం వృద్ధి చెంది, ఉన్నత చదువులు అభ్యసించిన అనేక మంది భక్తులు మొక్కులు చెల్లించుకునేందుకు వస్తుంటారు.

**బ్రహ్మోత్సవాలు ఇలా..**

మంగళవారం నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 21న పల్లకీసేవ, శ్రీనారసింహాస్వామి జయంతి జాతర ప్రారంభం, 22న గంధలేపనం, హోమం, 23న ఉదయం 5.30 నిమిషాలకు ప్రభోత్సవం, ఉదయం 9.45 నిమిషాలకు స్వామివారి కల్యాణోత్సవం, గండ జ్యోతులు, రాత్రి 9 గంటలకు రెట్టపట్లు, 24న తెల్లవారుజామున 5 గంటలకు రథోత్సవం, సాయంత్రం 5 గంటలకు పాలఉట్లు, 25న ఉదయం 10 గంటలకు గరుడవాహన సేవ, సాయంత్రం శేషవాహన సేవ, హనుమాన్ వాహనంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

**భక్తులకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం..**



మాగనూర్‌లో వెలిసిన లక్ష్మీనారసింహస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశాం. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారి కృపకు పాత్రులు కావాలి. స్వామివారి కల్యాణం, హోమంతో పాటు ప్రత్యేక పూజల్లో పాల్గొనాలి.

– వాకిటి వాలయ్య, ఆలయ కమిటీ చైర్మన్ మాగనూర్

## నకిలీ విత్తనాలతో అప్రమత్తంగా ఉండాలి

ఊట్కూరు: నకిలీ పత్తి విత్తనాలతో రైతులు అప్రమత్తంగా ఉండాలని హెడ్‌కానిస్టేబుల్ బాలరాజు అన్నారు. సోమవారం మండలంలోని మల్లెపల్లిలో సైబర్‌నేరాలు, నకిలీ విత్తనాలు, మత్తు పదార్థాలు, అంటరానితనం, మూఢనమ్మకాలు, బాల్యవివాహాలు, ట్రాఫిక్ చట్టాలు తదితర అంశాలపై కళాజాతా ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు తక్కువ ధరకు విత్తనాలు కొని మోసపోరాదన్నారు. గ్రామాల్లో ఎవరికైనా నకిలీ విత్తనాలు అమ్మితే సమాచారం అందించాలని అన్నారు. ఎవరైనా.. అత్యవసర పరిస్థితుల్లో 100 నంబర్‌కు సమాచారం అందించాలని, పోలీసులు తక్షణ సాయం అందిస్తారని తెలిపారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడంతో గ్రామాల్లో చోరీలు చేయడానికి భయపడుతారని అన్నారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు కనబడితే సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో కళాబృందం సభ్యులు సురేందర్, శేఖర్, లింగన్న, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.



మల్లెపల్లిలో కళాజాతా కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ సిబ్బంది

## ఎరువులు అందుబాటులో ఉంచుకోవాలి



దామరగిద్ద ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంఏఓ ప్రదీప్ కుమార్

దామరగిద్ద: రైతులకు వానా కాలం సీజన్‌కు అవసరమైన ఎరువులు విత్తనాలు అందుబాటులో ఉంచుకోవాలని మండల వ్యవసాయ అధికారి ప్రదీప్ కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని ఆగ్రోస్, రైతు సేవా కేంద్రాలు ఇతర ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందించాలన్నారు. ఈ సందర్భంగా ఆయా దుకాణాల్లో ఎరువులు విత్తనాల స్టాక్ రికార్డులను పరిశీలించారు. వానా కాలం సీజన్‌కు రైతులకు సరిపడా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. రైతులు నకిలీ విత్తనాలు కొని మోసపోవద్దని లైసెన్స్ కలిగిన డీలర్ల వద్ద కొనుగోలు చేయాలని, కొనుగోలు విత్తనాలకు రసీదు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ఈ పాస్ మిషన్‌లో ఎప్పటికప్పుడు ఎరువుల విక్రయాలను నమోదు చేయాలని డీలర్లకు తెలియజేశారు. ఆయన వెంట ఏఈఓ అజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

### ‘బీజేపీ గెలుపును ఆపలేరు’

మరికల్: మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి డీకే అరుణ గెలుపును ప్రతిపక్షాలు ఆపలేరని బీజేపీ నాయకులు వీరరాఘవరెడ్డి, రామేశ్వర్‌రెడ్డి, వేణు, రమేష్ అన్నారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. దేశంలో ప్రధాని నరేంద్రమోదీ చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు బీజేపీకి ఓటు వేశారన్నారు. అడ్డదారిలో అధికారంలోకి రావాలని చూస్తున్న కాంగ్రెస్ పార్టీకి ఈ సారి కూడా ప్రజలు బైబై చెప్పారన్నారు. రాష్ట్రంలో తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. ఈ సారి మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి తప్పకుండా విజయం సాధిస్తుందని వారు ధీమా వ్యక్తం చేశారు.

### తల్లిదండ్రుల చెంతకు చిన్నారి



నారాయణపేట రూరల్: తప్పిపోయిన ఓ చిన్నారి సురక్షితంగా తల్లిదండ్రుల చెంతకు చేరింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని సుభాష్‌రోడ్డుకు చెందిన సాయికృష్ణ కుమార్తె తన నానమ్మతో కలిసి సోమవారం ఉదయం సెంటర్‌చౌక్‌లో దుకాణానికి వచ్చింది. ఈ క్రమంలో తప్పిపోయి రోడ్డుపై రోదిస్తూ.. ఉన్న పాపను చూసి సమీపంలోని వ్యక్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న పోలీసులు చుట్టు పక్కల విచారించి చిన్నారి ఫొటోను వాట్సప్ గ్రూప్‌లో పోస్ట్ చేశారు. ఇది తెలుసుకున్న తల్లిదండ్రుల్లో పోలీస్‌స్టేషన్‌కు వచ్చి పాపను తీసుకెళ్లారు.

### పేకాట రాయుళ్ల అరెస్టు

మాగనూర్: మండల పరిధిలోని వద్వాట్‌లో ఓ ఇంట్లో కొంత మంది డబ్బులు పందెం పెట్టుకొని పేకాట ఆడుతుండగా.. టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి ఎనిమిది మంది వ్యక్తులను పట్టుకొని వారి నుంచి రూ.13,100 నగదు, ఏడు సెల్‌ఫోన్లు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా మాగనూర్ ఏఎస్ఐ మన్నన్ మాట్లాడారు. పేకాట ఆడుతున్న ఎనిమిది మంది వ్యక్తులపై గేమింగ్ యాక్టు ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేసన్నామని చెప్పారు.

# పట్టుతప్పిన ‘పరిరక్షణ’



బస్టాండ్ వద్ద ఆర్టీసీ బస్ నిలిపేందుకు అవకాశం లేకుండా ప్రైవేటు వాహనాలు ఇలా..

- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు
- పెరిగిన ప్రైవేటు వాహనాల జోరు

నారాయణపేట రూరల్: ప్రైవేటు వాహనాల నుంచి ఆర్టీసీని సంరక్షించాలని నిర్వహిస్తున్న ‘పరిరక్షణ’ కార్యక్రమం పడకేసింది. ప్రతిరోజు డిపోకు సంబంధించిన కార్మికులు, ఉద్యోగులు వారికి సంబంధించిన సెలవు రోజుల్లో వారికి కేటాయించిన చోట్ల సేవా దృక్పథంలో విధులు నిర్వహించి ఆర్టీసీని కాపాడాలనే ఉద్దేశంతో ఎండీ సజ్జనార్ ఈ పథకాన్ని రూపొందించారు. నారాయణపేటలో ముఖ్యంగా బస్టాండ్ బయట, పాత బస్టాండ్ వద్ద ప్రైవేటు వాహనాలు నిలుపకుండా, ప్రయాణికులకు అవగాహన కల్పించి ఆర్టీసీ బస్సులు ఎక్కేలా ప్రోత్సహించాలనేది ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం. ప్రైవేటు నుంచి ప్రయాణికులను ఆర్టీసీ బస్సుల వైపు మళ్లించి, వారు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేస్తే కలిగే లాభాలు తెలియజెప్పాల్సి ఉంటుంది. అయితే కార్యక్రమంపై ఆరు నెలలుగా పట్టించుకోవడంలేదు. దాదాపు స్థానిక డిపోలో 400 మంది సిబ్బంది, అధికారుల బృందం కన్నెత్తి చూడటం లేదు. నిరంతరాయంగా కొనసాగించాల్సిన పథకాన్ని అధికారులు పట్టించుకోకుండా పూర్తిగా నీరుగారుస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహాలక్ష్మి స్కీం తీసుకుని రావడంతో మహిళా ప్రయాణికుల సంఖ్య పెరగడంతో పాటు ఓఆర్ శాతం ఎక్కువ వస్తుందనే సాకుతో దీన్ని విస్మరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీంతో చాలా వరకు ప్రైవేటు ఆటోలు, జీపులు బస్టాండ్ బయటనే కాకుండా నేరుగా బస్టాండ్‌లోకి వచ్చి ప్రయాణికులను తీసుకుని వెళ్తున్నారు. ముఖ్యంగా మక్తల్, కోటకొండ రూట్‌తో పాటు కర్ణాటక రాష్ట్రం గుర్మిట్కల్, యాద్గీర్ వాహనాలతో బస్టాండ్ వద్ద ఎఫెక్ట్ పడుతుంది. అదేవిధంగా యానగుంది, మద్దూర్, వత్తుగుండ్ల ఆటోలు పాత బస్టాండ్ నుంచి ఆర్టీసీ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీకి చెందిన ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రయాణికులు కోరుతున్నారు.




ఆర్టీసీ బస్సు రాకముందే పాత బస్టాండ్‌లో ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్తున్న ఆటోలు

## చిన్నపాటి వర్షానికే రోడ్లు జలమయం



దామరగిద్ద నగరేశ్వర ఆలయ సమీపంలో రద్దుపై వర్షం నీరు ఇలా..

దామరగిద్ద: మండల కేంద్రంలో సోమవారం చిన్నపాటి వర్షం కురిసింది. దీంతో సంజీవరాయ చౌరస్తా నుంచి నగరేశ్వర ఆలయం వైపు వెళ్లే సంత బజార్ మొత్తం జలవయమైంది. రోడ్డుపై కల్వర్టు మూసుకుపోవడంతో పాటు డ్రెయినేజీ వ్యవస్థ మరమతులకు నోచుకోవడంలేదు. దీంతో వ్యవసాయ పొలంలో నుంచి, వర్షం నీరు రోడ్డు మీదకు చేరడంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానికులు వాపోతున్నారు.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదవాలి

మద్దూరు: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో కష్టపడి చదవి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, ఊరికి పేరు తీసుకురావాలని ఎంపీపీ విజయలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ నర్సింహ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఇటీవల పదో తరగతి, ఇంటర్, ఎంసెట్‌లో ప్రతిభ కనబర్చిన 11 మంది విద్యార్థులను సన్మానించారు. విద్యార్థులు బట్టి విధానానికి స్వస్తి పలకాలన్నారు. మద్దూరులో ఈ విద్యాసంవత్సరంలోనే ప్రభుత్వ డిగ్రీ కళాశాల తరగతులు ప్రారంభమయ్యాయన్నారు. ఇంటర్ పూర్తి చేసుకున్న విద్యార్థులను డిగ్రీ కోర్సులో చేర్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. సన్మానానికి కాంగ్రెస్ నాయకులు సంజీవ్ ముదిరాజ్ ఆర్థిక సాయం అందజేసినట్లు బీసీ సంఘం నాయకులు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహేష్‌గౌడ్, పీఆర్‌టీయూ అధ్యక్షుడు శ్రీనివాస్, ఎంపీటీసీ దిడ్డి రవికుమార్, ఇబ్రహీం, అశోక్‌గౌడ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను సన్మానిస్తున్న ఎంపీపీ, తహసీల్దార్

## రాయితీపై జీలుగ విత్తనాలు పంపిణీ



విత్తనాలు పంపిణీ చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

కోస్గి: వ్యవసాయ భూముల్ని సారవంతం చేసేందుకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రాయితీలతో విత్తనాలు అందజేస్తుందని, రైతులు ప్రభుత్వం అందించే రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని ఏఓ రామకృష్ణ సూచించారు. ఈ మేరకు సోమవారం ప్రభుత్వం రాయితీపై అందజేసిన జీలుగా పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. 30 కిలోల బరువున్న జీలుగ విత్తనాల బస్తా ధర రూ.2,790 కాగా.. రాయితీపై రూ.1,116 లకు అమ్ముతున్నారని చెప్పారు. మండల పరిధిలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాల్లో రాయితీ విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆగ్రోస్ కేంద్రంలో ఏర్పాటు చేసిన విత్తనాల పంపిణీకి ఏఓతో పాటు ఏఈఓలు హాజరై విత్తనాలు పంపిణీ చేశారు. ఇందులో ఏఈఓలు తిరుపతయ్య, వినోద్, రాధిక, నరేందర్‌తో పాటు ఆగ్రోస్ నిర్వాహకులు పాల్గొన్నారు.

## మరమ్మతుకు నోచుకోని వంతెనలు

నర్వ: మక్తల్, గద్వాల్ రహదారి సత్యవార్ నుంచి పెద్దకడ్మూర్ మధ్యన బ్రిడ్జిలు పూర్తిగా దెబ్బతిని గోతులు పడ్డాయని ప్రయాణికులు వాపోతున్నారు. కొన్ని రోజులుగా రహదారి పనులు చేపడుతున్న కాంట్రాక్టర్ ఈ బ్రిడ్జిలపై సీసీ రహదారి లేదా బీటీ రహదారి వేయాలని కోరుతున్నారు. కొండదొడ్డి, పెద్దకడ్మూర్ న్యారో బ్రిడ్జిలు పూర్తిగా దెబ్బతిన్న నేపథ్యంలో వీటిపై మరమ్మతు చేపట్టి సీసీ, వేయాలని కోరుతున్నారు. కొన్ని రోజులుగా ఆగిన బీటీ రహదారి పనులు ఇటీవల ప్రారంభమైన నేపథ్యంలో ఈ పనులు చేపట్టి రహదారి ఇబ్బందులు తీర్చాలని అధికారులను కోరుతున్నారు.



పెద్దకడ్మూర్ వద్ద వంతెన ఇలా..

## భారంగా రైతువేదికల నిర్వహణ

- నెలల తరబడి నిలిచిన నిధులు
- నిధులొస్తేనే సమస్యలకు పరిష్కారం



గోటూర్ రైతు వేదిక

ధన్వాడ: రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చేందుకు క్లస్టర్‌కు ఒకటి చొప్పున నిర్మించిన రైతు వేదికల నిర్వహణ ప్రశ్నార్థకమైంది. వీటి నిర్వహణకు నిధులు సకాలంలో రాకపోవడంతో నిర్వహణ మసకబారుతోంది. ఎక్కడ చూసినా రైతు వేదికలు దుమ్ము దూళితో కనిపిస్తున్నాయి. సమావేశాలకు ఉన్నత స్థాయి అధికారులు వస్తే మాత్రం రైతువేదికలను ఎన్ఆర్ఈజీఎస్ కూలీలు లేదా ప్రైవేట్ కార్మికులతో చేయిస్తున్నారు. టీ, టిఫిన్, తాగునీరు, ఎఈఓలే భరిస్తున్నారు. ఏఈఓలు పట్టించుకోని చోట రైతువేదికలు అపరిశుభ్రంగా మారుతున్నాయి.

**మండలంలో..**

మండలంలోని ధన్వాడ, కొండాపూర్, గోటూర్, గున్ముక్ల క్లస్టర్‌లో 4 రైతు వేదికలు ఉన్నాయి. 2021లో తెలంగాణ ప్రభుత్వం రూ.22 లక్షలతో ఒక్కో రైతువేదిక నిర్మించారు. ఇందులో విద్యుత్ బిల్లుకు రూ.1,000 పారిశుద్ధ్య నిర్వహణకు రూ.3,000, రైతుల శిక్షణకు రూ.2,500 తాగునీటికి రూ.500, మరమ్మతులు, స్టేషనరీ, జిరాక్స్‌లు, ఇతర ఖర్చులకు రూ.2,000 కేటాయించారు. ఈ మేరకు 2022 అగస్టు వరకే నిధులు విడుదల చేసింది. ప్రభుత్వం గతేడాది నుంచి నిధులు నిలిపివేయడంతో వాటి నిర్వహణ భారమైంది. దీంతో గదులను శుభ్రం చేయించడం ఏఈఓలకు తలకు మించిన భారమైంది. ఇప్పటికైనా ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయాలని రైతులు ఇటు అధికారులు కోరుతున్నారు.

**నిధులు రావడంలేదు..**

2022 నుంచి నిర్వహణకు సంబంధించిన నిధులు రావడం లేదు. నిర్వహణ భారంగానే ఉంది. విద్యుత్ బిల్లులు మాత్రం జిల్లా కేంద్రం నుంచి కడుతున్నారు.

– సైమన్, ఏఈఓ, ధన్వాడ

## అసంపూర్తిగా డెయిరీ కేంద్రం పనులు



నర్వలో అసంపూర్తిగా నిలిచిపోయిన పాలడెయిరీ కేంద్రం పనులు

నర్వ: మండలంలో పశుపోషకులను ప్రోత్సహించి పాల ఉత్పత్తిని పెంచేందుకు నిర్మాణం చేసిన డెయిరీ కేంద్రం పనులు కొన్నేళ్లుగా అసంపూర్తిగా ఉన్నాయని రైతులు వాపోతున్నారు. కొన్నేళ్ల కిందట పనులను ప్రారంభించి నిధులు లేమితో అసంపూర్తిగా వదిలేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ పక్కన చేపట్టిన ఈ పనులు అసంపూర్తిగా వదిలేశారని వాపోతున్నారు. రోడ్డు పనులు చేపట్టడంతో ఈ అసంపూర్తి కేంద్రం పూర్తిగా కూరుకుపోయిందన్నారు. పాడి రైతులు పాల ఉత్పత్తులను ప్రైవేటుకు తక్కువ ధరకు అమ్ముకొని నష్టపోతున్నామని, ప్రభుత్వం చొరవచూపి అసంపూర్తి పాలడైరీ కేంద్రం పనులు పూర్తి చేసి రైతులను ప్రోత్సహించాలని కోరుతున్నారు.